క్లుప్తంగా

నేడు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక రైతు వేదికలో అన్నదాతలకు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బత్తిని సత్యాన్వేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రైతుల ముంగిట్లోకి శాస్త్రవేత్తలను తీసుకురావడం వల్ల రైతులు నూతన సాగువిధానంపై అవగాహన పెంచుకునే అవకాశం ఉందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోడమే కాకుండా వ్యవసాయ అనుబంధశాఖల సహకారం ద్వారా శాస్త్రవేత్తలు పరిష్కారాలు, సలహాలు, సూచనలు ఇస్తారని చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం తోర్నాల, జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


సామూహిక పూజల్లో పాల్గొన్న మహిళలు

మిరుదొడ్డి(దుబ్బాక): మాదిగ చైతన్య సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి తొమ్మిదవ ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వితాల రాజపున్నయ్య శర్మ, చంద్రశేఖర శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు మంగళహారతులతో పాల్గొని సామూహిక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాద వితరణతో పాటు అన్నదానం నిర్వహించారు.

దుబ్బరాజేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం


శతరుద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

దుబ్బాక: చౌదర్‌పల్లిలో వెలసిన దుబ్బరాజేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు దుబ్బరాజంశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

'ప్రైవేట్'కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలు


బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

మద్దూరు(హుస్నాబాద్): ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందుతోందని రేబర్తి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రభాను అన్నారు. మండలంలోని రేబర్తి గ్రామంలో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడిగా సాయన్న


సాయన్నను సత్కరిస్తున్న సాంబరాజు తదితరులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మాదిగ కుల సంఘం నూతన అధ్యక్షుడుగా తొందూరు సాయన్న ఆదివారం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ ఎంపీటీసీ సభ్యుడు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యుల సహకారంతో కుల సంఘాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో రైతు మిత్ర సమితి అధ్యక్షుడు రవీందర్, సది, మాజీ ఉపసర్పంచ్ సారన్న, సంఘం నాయకులు ఎల్లన్న, రాజన్న, రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే కొంగు బంగారం

నేటి నుంచి రేణుక ఎల్లమ్మ జాతర

- నెల రోజుల పాటు జరగనున్న ఉత్సవాలు
- పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి పొన్నం

ఆలయంలో కొలువైన ఎల్లమ్మ తల్లి


హుస్నాబాద్: కోర్కెలు తీర్చే కొంగు బంగారం పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయాన్ని కాకతీయుల కాలంలో నిర్మించారు. సర్వాయి పాపన్న పునర్నిర్మించినట్టు చెప్తారు. మొదట ఈ ఆలయం పూరిగుడిసెలో ఉండేది. 2003లో దేవాదాయశాఖ పరిధిలో చేర్చారు.

నెల రోజులపాటు ఉత్సవాలు

రేణుక ఎల్లమ్మ జాతర వైశాఖ పౌర్ణమి రోజైన 12వ తేదీ నుంచి జ్యేష్ట పౌర్ణమి జూన్ 11 వరకు నెల రోజుల పాటు నిర్వహించనున్నారు. అందులో భాగంగా 12న రేణుక ఎల్లమ్మ, జమదగ్ని మహాముని కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. అలాగే ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు అమ్మవారి సిద్ధయాగం కథ కార్యక్రమం నిర్వహించనున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారికి పట్టు వస్త్రాలు, అమ్మవారికి ఆరు కిలోల వెండి తొడుగులు సమర్పిస్తారు.

ఘనంగా బోనాలు

మొదటి రోజు అమ్మవారికి, స్వామి వారికి బాషికాలు కట్టడం, బోనాలు వేయడం ఆనవాయితీగా వస్తుంది. ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి బోనం పోస్తారు. సాయంత్రం బండ్లు తిరిగే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాలాల్లో అమ్మవారికి కుంకుమార్చనలు, ఒడి బియ్యం, బోనాలు, పట్నాలతో జాతర వైభవంగా జరుపుతారు.


మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్న షాపింగ్ కాంప్లెక్స్, మినరల్ వాటర్ ప్లాంట్



సర్వం సిద్ధం

ఎల్లమ్మ జాతరకు వివిధ జిల్లాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి బోనాలతో తరలి రానున్న భక్తుల కోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. విద్యుత్ అలంకరణతో దేవాలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆలయ గోపురాన్ని రూ.50 లక్షలతో నిర్మాణ పనులు కొన సాగిస్తున్నారు. దేవాలయ అభివృద్ధి కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.9 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. దాతల సహకారంతో ఆరు గదుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. పోలీసుల సూచనల మేరకు క్యూ లైన్లు ఏర్పాటు చేశారు.

ప్రారంభోత్సవాలు

ఎన్‌ఆర్‌ఐ వి- నెట్ రఘు ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్, దాతల సహకారంతో నిర్మించిన ఆరు గదుల షాపింగ్ కాంప్లెక్స్‌ను మంత్రి పొన్నం ప్రారంభించనున్నారు.

గ్రామ దేవతలకు ఎమ్మెల్యే పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్, ఎమ్మెల్యే పల్లా

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కొత్త దొమ్మాట గ్రామంలో నిర్వహించిన పెద్దమ్మతల్లి, దుర్గమ్మతల్లి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆదివారం శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలపై ఉండాలని కోరారు. దేవాలయ నిర్మాణంలో పాలు పంచుకున్న దాతలందరినీ అభినందించారు. అమ్మవార్ల ఆశీస్సులతో రెండు పంటలు పుష్కలంగా పండి, సిరిసంపదలు రావాలని ఆకాంక్షించారు. వారి వెంట స్థానిక నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

చేర్యాల(సిద్దిపేట): విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు పోలోజు ఆంజనేయులును ఎమ్మెల్యే పల్లా పరామర్శించారు. ఇటీవల ఆంజనేయులు తండ్రి రవీందర్‌చారి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

మద్దూరు(హుస్నాబాద్): శారీరక దృఢత్వానికి, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న హ్యాండ్ బాల్ సమ్మర్ క్యాంపును ఆయన సందర్శించారు. విద్యార్థులతో కలిసి హ్యాండ్ బాల్ ఆడి వారిలో ఉత్సాహం నింపారు. క్రీడల వల్ల పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఈ సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు సర్వం సిద్ధం

ప్రిన్సిపాల్ గోవర్ధన్


ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

నంగునూరు(సిద్దిపేట): పాలిటెక్నిక్ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా, వ్యవసాయ, వెటర్నరీ కోర్సుల్లో ప్రవేశం కోసం 13న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని పరీక్షల సమన్వయ కర్త, రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అలుగోజు గోవర్ధన్ తెలిపారు. కళాశాలలో పది రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత పాలీసెట్ శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 3,801 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారన్నారు. ఇందకు గాను సిద్దిపేటలో ఐదు, గజ్వేల్‌లో మూడు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని, ఉదయం 11 నుంచి 1.30 వరకు పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

శ్రీరామ నామానికి మించిన స్మరణ లేదు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు


హనుమాన్ పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామీజీ ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: శ్రీరామ నామాన్ని మించిన స్మరణ లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం రాత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన హనుమాన్ స్వాముల భజనలో హనుమాన్ దీక్షా పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామీజీతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ 40 యేళ్ల క్రితం కేవలం ఐదుగురితో హనుమాన్ దీక్ష మొదలైందన్నారు. అనంతరం పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామీజీ మాట్లాడుతూ హనుమాన్ మాల ధారణ వల్ల మనస్సుకు ప్రశాంతత ఉంటుందన్నారు. హరీశ్‌రావు లాంటి నాయకులు ఉంటే విద్యుత్, నీటికి కొదువ ఉండదని ప్రశంసించారు. అనంతరం స్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేదార్‌నాథ్ సేవా సమితి సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో స్వాములు సంపత్ రెడ్డి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

మదర్స్‌డే సందర్భంగా ఈఓకు సన్మానం


ఈఓ అన్నపూర్ణను సన్మానిస్తున్న లక్ష్మణ్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ఈఓ అన్నపూర్ణను కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకుడు భీమా లక్ష్మణ్ మదర్స్‌డే సందర్భంగా ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల ప్రాధాన్యం గుర్తించవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి ఉన్నారు.

బీజేపీ పట్టణ కమిటీ నియామకం

చేర్యాల(సిద్దిపేట): బీజేపీ జిల్లా అధ్యక్షుడు సొడ రమేశ్ ఆదేశాల పట్టణ అధ్యక్షుడు కర్క తిరుపతిరెడ్డి పట్టణ కమిటీని ఆదివారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కొట్టె చంద్రమౌళి, వలిమే బాపూరావు, మిట్టపల్లి వెంకట్ రెడ్డి, వలిమే సావిత్రి; ప్రధాన కార్యదర్శులుగా పంగ సిద్దులు, కలకుంట్ల మనీష్; కార్యదర్శులుగా తుప్పతి రమేశ్, వెలుగల వినయ్, పంగ ప్రదీప, బి.పద్మ; ట్రెజరర్‌గా తడక లక్ష్మణ్‌తో పాటు 34 మంది కార్యవర్గ సభ్యులను నియమించినట్టు తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం


కిష్టయ్య

మద్దూరు(హుస్నాబాద్): ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన మండలంలోని బెక్కల్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బెక్కల్ గ్రామానికి చెందిన చింతల కిష్టయ్య(65) ఆదివారం ఉదయం ఆరు గంటలకు బయటకు వెళ్తున్నానని ఇంటిలో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కోరారు.

'సిందూర్'కు మద్దతుగా సుదర్శన యాగం


హోమాల్లో పాల్గొన్న అపార్ట్‌మెంట్ వాసులు

సిద్దిపేటజోన్ : ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా సరిహద్దుల్లో పోరాడుతున్న వీర జవాన్‌ల క్షేమాన్ని కోరుతూ సుదర్శన యాగం నిర్వహించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని కాప్ర మండలంలోని కనకధార లాండ్‌మార్క్ అపార్ట్‌మెంట్స్‌లో పండితులు ఆదరాసుపల్లి భరత్ కుమార్శర్మ, త్రిగుళ్ల సాకేత్ రామశర్మ ఆధ్వర్యంలో ఆదివారం గణపతి, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో శత్రుసంహారం కోసం, అలాగే సైనికుల విజయ సాధనలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఉండటానికి ఈ హోమాలు నిర్వహించామన్నారు. అనంతరం ఎంబీబీఎస్ వ్యవస్థాపకుడు ఎ.శ్యామ్మోహన్ శర్మ, అపార్ట్‌మెంట్ నివాసి నాగేశ్వర రావు మాట్లాడారు. పెహల్గామ్ ఘటన, యుద్ధానికి దారితీసిన కారణాలు, సైనికులు సాధించిన విజయాల గురించి వారు వివరించారు. 100కు పైగా సభ్యులు పాల్గొని దేశభక్తిని చాటారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దు

అదనపు సీఐ ముత్యంరాజు


ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు

గజ్వేల్‌రూరల్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చర్యలు తప్పవని అదనపు సీఐ ముత్యంరాజు హెచ్చరించారు. బస్టాండ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, హనుమాన్ దేవాలయం రోడ్డుతోపాటు పలు అనుమానాస్పద ప్రాంతాల్లో నార్కోటిక్ డాగ్స్‌తో ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు కలిగిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్నా, అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించాలని, గంజాయి రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఎస్‌ఐ ఉమారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగంగా తాగేస్తున్నారు!

- పాఠశాలలు, పొలాలే అడ్డాలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు


అనంతసాగర్ శివారులో మద్యం సీసాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మందుబాబులు బహిరంగా మద్యం తాగుతూ పరిసరాలను కాలుష్యం చేస్తున్నారు. వారికి గ్రామాల్లోని శివారు పంట భూములు, ప్రహరీ లేని ప్రభుత్వ పాఠశాలలు అడ్డాలుగా మారాయి. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం తాగి సీసాలను అక్కడే పడేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల వద్ద పగిలిన సీసాలతో గాయాలపాలవు తున్నామని వాపోతున్నారు. అవే స్థలాల్లో చిన్నారులు ఆటకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రహరీ లేని పాఠశాలల ఆవరణల్లో రాత్రి సమయంలో మద్యం సేవిస్తున్నారు. పోలీసులు, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, అందువల్ల మందుబాబులు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే బహిరంగ మద్యపానం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

యుద్ధంలో విజయం పొందాలని పూజలు


కూడవెల్లి ఆలయంలో నిర్వహిస్తున్న హోమం

దుబ్బాక: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సైనికులు విజయం సాధించాలని కోరుతూ కూడవెల్లి రామలింగేశ్వర ఆలయంలో మన్యుసుక్త పారాయణ హోమం నిర్వహించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం ఆలయంలో ప్రధాన అర్చకుడు సాకేత్‌శర్మ ఆధ్వర్యంలో హోమం జరిగింది. కార్యక్రమంలో ఆలయం చైర్మన్ రాజిరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ధైర్యసాహసాలు కల్పించాలి..

గజ్వేల్‌రూరల్: పాకిస్థాన్‌పై యుద్ధం చేస్తున్న త్రివిధ దళాల సైనికులకు ధైర్య సాహసాలు కల్పించాలని కోరుతూ పాండవుల చెరువుగట్టుపై గల కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం జరిపించారు. కార్యక్రమంలో హనుమాన్ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సేవా సంస్థలు


పుణ్యవతికి ఆర్థికసాయం అందజేస్తున్న ఆపన్నహస్తం మిత్ర బృందం

గజ్వేల్‌రూరల్: నిరుపేద కుటుంబాలకు ఆపన్న హస్తం, చెలిమి ఫౌండేషన్‌లు అండగా నిలిచాయి. ములుగు మండలం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(తానేదార్ పల్లి)లోకి చెందిన జామకాయల కనకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడి భార్య పుణ్యవతి, ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన ఆపన్నహస్త మిత్రబృందం ఆదివారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించింది. రూ.20 వేలు అందజేసి అండగా నిలిచారు. అదే విధంగా వర్గల్ మండలం చౌదార్‌పల్లికి చెందిన చింత వెంకటేశం ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన చెలిమి ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి రూ.3,500 విలువైన నిత్యావసరాలు, రూ.11,500 నగదును అందించి మనోధైర్యం కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో బాల్‌చంద్రం, శ్రీనివాస్, శ్యామ్, స్వామి, విశ్వేశ్వర్‌రావు, ప్రకాశ్, కిరణ్, సంతోష్, ఆనంద్, గుంటుకు శ్రీను, నర్సింహులు, ఇబ్రహీమ్, రమేశ్, తులసీదాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి 'చెలిమి' ఆసరా

నగదు, నిత్యావసరాలు అందజేత


సరుకులు, నగదు అందజేస్తున్న 'చెలిమి' బృందం

వర్గల్(గజ్వేల్): భర్త ఆత్మహత్యతో పెద్దదిక్కును కోల్పోయి పేదరికంతో అల్లాడుతున్న ఓ కుటుంబానికి గజ్వేల్‌లోని 'చెలిమి' ఫౌండేషన్ ఆసరాగా నిలిచింది. మండలంలోని చౌదరిపల్లికి చెందిన చింత వెంకటేశం గౌరారంలోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడు అప్పులు బాధతో ఫిబ్రవరిలో ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి భార్య రమ్య, ఐదేళ్లలోపు ముగ్గురు పిల్లలతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. ఈ విషయం తెలిసి ఆదివారం గజ్వేల్ చెలిమి ఫౌండేషన్ ప్రతినిధులు కిరణ్ కుమార్, సంతోష్, శ్రీనివాస్, ఆంజనేయులు, ఆనంద్, శ్రీనివాస్ బృందం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఫౌండేషన్ తరపున రూ.11,500 నగదు, రూ.3,500 విలువైన నిత్యావసర సరుకులు అందజేసి ఉదారత చాటుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దుబ్బాకటౌన్: మున్సిపల్ పరిధిలోని లచ్చపేట జిల్లా పరిషత్ పాఠశాలలో 1997–1998లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ గురువులను శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కుమార్, ఎల్లం, గోపాల్ రెడ్డి, దుర్గయ్య, శ్రీను, రమేశ్, శ్రీకాంత్, అంజలి, ప్రజ్వల, కల్యాణి తదితరులున్నారు.

నంగునూరు ఉన్నత పాఠశాలలో..

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు ఉన్నత పాఠశాలలో 2001–02 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. చాలా సంవత్సరాల తరువాత కలుసుకోవడంతో ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమకు విద్యా బుద్దులు చెప్పిన గురువులు వెంకటేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, కనకయ్యతోపాటు హెచ్‌ఎం రామస్వామిని సన్మానించారు.


నంగునూరులో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


దుబ్బాకటౌన్: ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో విద్యార్థులు